


# తోడు

-ఉన్నవ మదనమోహనరావు

**కుమారి లావణ్య** రిటైరయింది. మూడు దశాబ్దాలకు పైగా అధికారిణిగా పనిచేసిన లావణ్యను రెండు నెలల క్రితం ఇక విశ్రాంతి తీసుకోమన్నది ప్రభుత్వం.

కాని, ఈ రెండు నెలలే ఎంతో భారంగా అనిపించాయి లావణ్యకు. పని లేకపోవడంతో ఏమీ తోచడం లేదు. విసుగ్గా ఉంది. ఆ విసుగుదలకు ప్రత్యక్షంగా గురి అవుతున్నది అప్పలమ్మ. తన విసుగుదల తనకే ఆశ్చర్యం కలిగిస్తున్నది లావణ్యకు. ఎంత నిగ్రహించుకొన్నా, తన చిరాకు బహిర్గత మవుతూనే ఉంది. తనలోని మార్పును అప్పలమ్మ విస్తుపోవడం కూడా గమనించకపోలేదు లావణ్య.

'రిటైర్ అయ్యావు కదా! ఒక్కదానివీ ఆ వూళ్ళో ఎందుకు? నా దగ్గరికే వచ్చి ఉండు, అక్కయ్యా!' అని వ్రాశాడు తమ్ముడు సుభాష్.

కాని, తమ్ముడికి తనమీద కంటే తను సంపాదించిన డబ్బుమీద ప్రేమ ఎక్కువని లావణ్యకు బాగా తెలుసు. వాడి ఆంతర్యం పసిగట్ట లేనంత పసిపిల్లగాదు తను.

చెల్లెలు రాధ—''తన రెండోవాడిని పెంచుకో, అక్కయ్యా! నీకు తోడుగా ఉంటాడు'' అని వ్రాసింది. చెల్లెలు ఆంతర్యం ఒక్కటే. క్రిందటి దసరాకు పెట్టిన చీర ఖరీదు తక్కువని, బాగాలేదని నోరు పారేసుకుంది అప్పలమ్మ దగ్గర. దానికి ఎంత పెట్టినా తృప్తి అంటూ లేదు.

తన జీవితంలో ఏదో వెలితిగా ఉండనిపించింది లావణ్యకు. అసలు అలాంటి వెలితి ఒక టున్నదని తెలియలేదు ఇన్నాళ్ళూ.

అధికారిణిగా తనకు చేతినిండా పని. మందీ మార్బలంతో తాను ఒక రాణిలాగ ఫీలయ్యేది. ఆఫీసులో తన గదికి వెళుతుంటే ఉద్యోగు లందరూ లేచి నిలబడి 'విష్' చేసేవారు. అప్పుడు తను ఎంతో ఠీవిగా నడిచేది.

• • • •

లావణ్యకు తను కాలేజీలో చదువుకొనే రోజులు గుర్తుకు వచ్చాయి. తన క్లాసులో ఎనిమిది మంది ఆడ పిల్ల లుండేవాళ్ళు. వాళ్ళకు తనే నాయకురాలు.

తనంటే మగ పిల్లలకు కూడా హడల్. ఒకసారి ఏమయిందని? రాజేష్ ప్రేమలేఖ వ్రాశాడు తనకు! తను ఆ లెటర్ తీసుకెళ్ళి ప్రిన్సిపల్‌కి చూపించింది. ప్రిన్సిపల్ రాజేష్‌ని పిలిచి ముక్క చీవాట్లు పెట్టాడు. టి. సి. ఇచ్చి పంపించి వేస్తానన్నాడు. ఎప్పుడూ పోజులుకొట్టే రాజేష్ కళ్ళనీళ్ళు పెట్టుకొని ఏడుస్తూ చెంపలు వేసుకొన్నాడు తన ఎదుట.

రాజేష్ ఏమయ్యాడో? పెళ్ళి చేసుకొన్నాడో లేదో? పెళ్ళాం, పిల్లలు, సంసారంలో పడిఉంటాడు. బహుశా నాలాగ రిటైరయి కూడా ఉండవచ్చు. పాపం! తొలిసారిగా లావణ్యకు రాజేష్‌మీద జాలి కలిగింది ఇన్నాళ్ళకు.

• • • •

లావణ్య ఉద్యోగంలో చేరిన తొలి దినాలు అవి. ఆఫీసులో పని కొత్త. తెలియకపోతే పక్క సీటులో ఉన్న కామేశాన్ని అడిగేది. కామేశాన్నే ఎందుకు అడిగేదంటే, అతను ఒక్కడే కాస్త సంస్కారం కలవాడిలా కనిపించాడు. మిగిలినవాళ్ళంతా గుంట నక్కల్లా కొరకొరా చూస్తుండేవాళ్ళు తనని నమిలి మింగేద్దామా అన్నట్లుగా! ఆ ముసలి సూపరింటెండెంటు. వాడికి తన వయసుగల కూతుళ్ళు ఉండి ఉంటారు. అయినా, తనతో వెకిలిగా మాటాడేవాడు. బొత్తిగా సభ్యత లేని వాళ్ళు.

నాలుగు నెలల తరవాత ఒక రోజు కామేశం—"లావణ్యగారూ! మీతో ఒకసారి మాట్లాడవలసిన పని ఉంది. అలా పబ్లిక్ గార్డెన్‌దాకా వస్తారా" అని అడిగాడు ప్రాధేయపూర్వకంగా.

'సరే' అని తల వూపింది తను, కామేశంమీద ఉన్న సదభిప్రాయంతో.

ఎంతో సంబరపడిపోయాడు కామేశం. మర్నాడు గార్డెన్‌లో కూర్చున్న తరవాత—"లావణ్యగారూ! మీరు మరోలా భావించక పోతే ఒక విషయం అడుగుదామని ఉంది.... మీరు నాకు ఎంతగానో నచ్చారు. మీరంటే ఒక విధమైన అనురాగం నింపుకొన్నాను నా మనసులో. మీరు కనక అంగీకరించినట్లయితే మనం వివాహం చేసుకొందామని—ఏమంటారు?" తన కళ్ళలోకి ఆశగా చూస్తూ అడిగాడు కామేశం.

కామేశం మాటలు ఇప్పుడు తన హృదయాన్ని స్పందింప చేస్తున్నాయి కాని, ఆనాడు తన హృదయం స్పందించలేదు. తన కళ్ళు, చెక్కిళ్ళు ఎర్రబడ్డాయి.

"మిస్టర్ కామేశంగారూ! కాస్త జాగ్రత్తగా మాటాడండి! ఇన్నాళ్ళూ మీ రేదో సంస్కారవంతులని అనుకొన్నాను. కాస్త చనువుగా మాట్లాడితే చాలు, ప్రేమటూ...ప్రేమ...! ఛీ...ఏంమగాళ్ళు!"

కామేశం నివ్వెరపోయాడు! కాసేపటికి తేరుకొని-"సారీ, మేడమ్! నన్ను క్షమించండి. మీ మనసు నొప్పించాను. మరోలా భావించకండి." ఎంతో దీనంగా కళ్ళలో నీళ్ళు తిరుగుతుంటే తల వంచుకొన్నాడు.

ఈ సంఘటన జరిగిన తరువాత కామేశం తనను చూసినప్పుడల్లా ముడుచుకొనిపోయేవాడు. తను ఎంతో గర్వంగా ఫీలయ్యేది.

తరవాత కామేశం ఎన్నో టెస్టులు పాసయ్యాడు. డైరెక్టరుగా కూడా ప్రమోట్ అయ్యాడు.

• • •

తన జీవితంలో ప్రవేశించాలని విఫల యత్నం చేసిన నటరాజు, నాగేష్ స్మృతి పథంలో మెదిలారు లావణ్యకు.

"భోజనానికి రండమ్మా!" అని మూడుసార్లు అప్పలమ్మ పిలిస్తే గాని వినిపించలేదు లావణ్యకు.

"నాకు ఆకలిగా లేదు. నువ్వు తినేసి ఇంటికి పో!" లావణ్య స్వరంలో విసుగుదల చోటు చేసుకొంది.

---

**మన హృదయాలను కదిలించగోరే వారి హృదయాలు కదలగలవై ఉండి తీరాలి.**

-ఛార్లైన్ చర్చిల్

---

"ఒంట్లో కులాసాగా లేదా, అమ్మా!" తల్లిలా అడిగింది అప్పలమ్మ.

"నాకు బాగానే ఉంది గాని, వూరికే ప్రశ్నలు వేసి నన్ను విసిగించకు. నువ్వు తినేసి మిగిలింది బిచ్చగాడికి వేసెయ్యి! నాకోసం ఉంచకు!" చిరాకు పడ్డది లావణ్య తన స్మృతులకు అడ్డం తగిలిన అప్పలమ్మమీద.

"డాక్టరుకు చూపించుకోమంటే చూపించుకోరు! ఒంట్లో ఎలా ఉందో చెప్పమంటే చెప్పరు! ఏమీ లేదంటారు. ఏమీ లేకపోతే ఎప్పుడైనా నన్ను విసుక్కొన్నారా? ఎప్పుడూ హుషారుగా వుండేవారు. ఉత్సాహంగా ఆఫీసుకు వెళ్ళేవారు. చూస్తున్నానుగా. మరీ రిటైరయినప్పటినుంచి మీకు మనసు బాగా లేదు. వూరికే చిర్రు బుర్రు లాడుతున్నారు: అయినదానికీ, కానిదానికీను. ఇలా అయితే ఎలాగమ్మా? తల్లిలాంటిదాన్ని. నాతో కూడా చెప్పుకోకపోతే ఏం చేసేది?" అభిమానం, అనురాగం, అధికారం మేళవించిన స్వరంతో అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది అప్పలమ్మ.

లావణ్యకి నిజంగా సిగ్గేసింది. అప్పలమ్మనా తను విసుక్కొంటున్నది? ఈ ఇరవై ఏండ్లనుంచీ అప్పలమ్మ తనకు తల్లి, ఆయా. పనిమనిషి, వంట మనిషి స్థానంనుంచి అప్పలమ్మ అపురూపంగా ఎదిగింది.

• • •

"అమ్మా! పట్టెడన్నం ఉంటే పెట్టు, తల్లీ!" తెరిచిన గేటులోంచి లోపలికి వచ్చి దీనంగా అంటున్న బిచ్చగాడి కేకతో లావణ్య ఆలోచనలకు మళ్ళీ అంతరాయం కలిగింది.

"ఉండు" అని చెప్పి లోపలికి వెళ్ళింది అప్పలమ్మ. ఓపిగ్గా నిలబడలేక నేలమీద కూర్చున్నాడు బిచ్చగాడు. దాదాపు ఎనభై ఏళ్ళదాకా ఉంటాయి ఆ ముసలివాడికి. ముడతలు పడిన చర్మం అస్థి పంజరానికి తొడుగులా ఉంది. నరాలూ, ఎముకలూ లెక్కపెట్టటానికి వీలయినంత స్పష్టంగా కనిపిస్తున్నాయి. అప్పలమ్మ అన్నం తెచ్చేలోగా ఏదో గొణుక్కుంటున్నాడు తనలోనే.

ఇంతలో అన్నం తెచ్చి పెట్టింది అప్పలమ్మ. గుడ్డలో పెట్టించుకొన్నాడు బిచ్చగాడు.

"నీ దగ్గర గిన్నె ఏదైనా ఉందా? పరమాన్నం పోస్తాను." అడిగింది అప్పలమ్మ.

బిచ్చగాడిదగ్గర గిన్నె లేదు.

"గిన్నె లేదు, తల్లీ!" గిన్నె లేనందుకు ఎంతగానో బాధపడ్డాడా పండు ముదుసలి.

"పోనీ, గ్లాసులో పోసి ఇస్తా. ఇక్కడే తాగేసి పో" అంది అప్పలమ్మ.

"లేదు, తల్లీ! దరమతల్లీ! ఇంటికాడ ముసిలిది ఉంది. కళ్ళు లేవు—పళ్ళు లేవు. దానికి పోతా, తల్లీ! దానికి ఎంతో ఇట్టం! దానికి నేను తోడు, నాకు అది తోడు. అయ్యో, తల్లీ! గిన్నె లేదాయె! పెడతామంటున్నా ప్రాపతం లేదాయె! ముసలిదానికి ప్రాపతం లేదాయె!"

"పోనీ, నీవు తాగిపోరాదూ! గోల." అప్పలమ్మ విసుగుపడుతూ అంది.

"దరమతల్లీ! ముసిలిదాన్ని ఇడిచి నే నొక్కణ్ణే తాగలేను, తల్లీ! ఏదో బతికినంత కాలం నాకు అదీ, దానికి నేనూ! బగమంతుడికి ఎప్పుడు దయ కలుగుతుందో మరి! అందాక దొరికింది కలిసే తింటాం తల్లీ!" ముసలివాడు వాడి ధోరణిలో వాగుతూనే ఉన్నాడు.

లావణ్యకు ఆ క్షణంలో ఆ బిచ్చగాడి భార్య ఎంత అదృష్టవంతురాలో అనిపించింది. గుడ్డి ముసలిదానికోసం—అది తినకపోతే బాధపడే తోడు ఉన్నాడు. దానికి అందించలేని పరమాన్నం తనూ తాగనని భీష్మించుకొనే ప్రేమమూర్తి ఉన్నాడు.

తన జీవితంలో లేని దేమిటో స్పష్టంగా తెలిసింది లావణ్యకు. తన జీవితం అనాఘ్రాత కుసుమం. చెట్టుమీదనే వాడిపోయి నేలలో కలిసిపోవటానికి సిద్ధంగా ఉన్న పుష్పం తాను. ఇది ఎవరి సొసుభాలికీ, అనురాగానికి నోచుకోని పూవు. ఇది నేల రాలినా ఒక అశ్రుబిందువు కూడా రాల్చేవారు లేరు!

లావణ్య కన్నులలో నీరు నిండింది తొలిసారిగా. "అప్పలమ్మా! గ్లాసుతో పరమాన్నం ఇంటికి తీసుకొని వెళ్ళమను వాడిని. ఆ అదృష్టవంతురాలికి పోసి తనూ తాగుతాడు!" అరిచింది కుమారి లావణ్య. *